క్లుప్తంగా

ఘనంగా ఏకాదశి తిరువీధి



బేడామండపంలో మదనగోపాలస్వామి తిరువీధిలో అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ఏకాదశి తిరువీధి వైభవంగా జరిగింది. ఆలయంలో కొలువుదీరిన మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం బేడా మండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. పారాయణాలు పఠించారు. విశేషంగా హారతి అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అన్నప్రసాదం నాణ్యతలో రాజీపడొద్దు



అన్నప్రసాదం నాణ్యతను పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై నిత్యాన్నదాన పథకంలో భక్తులకు అందించే అన్నప్రసాదం నాణ్యతగా ఉండాలని, అందులో ఎలాంటి రాజీ పడొద్దని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నప్రసాద విభాగం అధికారులకు సూచించారు. అన్నప్రసాద భవనంలో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. భక్తులకు వడ్డించే అన్నంతో పాటు సాంబారు, కూర, మజ్జిగ రుచులను పరిశీలించారు. అన్నప్రసాదం నాణ్యత ఎలా ఉందో.. భక్తులను అడిగి తెలుసుకున్నారు. మొదటి పంక్తి నుంచి చివరి పంక్తి వరకు భక్తులకు ఒకే రకమైన నాణ్యతతో ఉన్న అన్నప్రసాదాన్ని అందించాలని సూచించారు. పలువురు భక్తులు అన్నప్రసాదం బాగుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నప్రసాద విభాగం ఏఈవో రమణమూర్తి, సూపరింటెండెంట్ నరసింగరావు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, డీఆర్‌సీ షాపింగ్ మాల్ అధినేత దాడి రమణచిట్టి, జీవీఎంసీ 96వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దాడి ఉమామహేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. రక్తదాన శిబిరంలో 10 యూనిట్లు సేకరించారు. సుజాతనగర్‌లోని ఎల్ఎస్ ఆస్పత్రి, అనిల్ నీరుకొండ దంత వైద్యశాల, విజన్ ట్రీ నేత్ర వైద్యశాల బృందాలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగించండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్

పెందుర్తి: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై యువతకు అవగాహన కలిగించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ ఓటర్ల జాబితా అంశంపై రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించాలన్నారు. ఓటు హక్కు నమోదు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సేవలో.. సాయి హెల్పింగ్ హ్యాండ్స్



లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు కేశఖండన సేవ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అనాథలు, మానసిక దివ్యాంగులకు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం కేశ ఖండన సేవ చేశారు. ఆశ్రమంలో ఉన్న 200 మందికి ట్రస్ట్ ప్రతినిధులు స్వయంగా కేశ ఖండన చేశారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, ప్రతినిధులు సిరిమళ్ల గణేష్, కందల నవీన్, బయ్యవరపు సురేష్, బయ్యవరపు చిన బాబు, కొండలరావు, ఎల్లపు అనిల్‌కుమార్, లయోలా సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు చేరని స్టాంప్ డ్యూటీ!

- పెందుర్తిలో 15 పంచాయతీలకు రూ.5 కోట్ల బకాయిలు
- కంటితుడుపుగా ఇటీవల రూ.9.23 లక్షలు విడుదల
- జీతాలు, విద్యుత్ బిల్లులు, ఇతర చెల్లింపులపై ప్రభావం

పెందుర్తి మండలంలోని 15 పంచాయతీల నుంచి వీధిదీపాలు, సచివాలయాల విద్యుత్ చార్జీలు దాదాపు రూ.1.20 కోట్లు బకాయిలు ఉన్నాయి. అవి వసూలు చేయాలని మాకు ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. తక్షణమే ఆయా నిధులు వచ్చేలా చర్యలు తీసుకోండి.

- మండల పరిషత్ అధికారులకు ఈపీడీసీఎల్ పెందుర్తి, వేపగుంట, సుజాతనగర్ ఏఈల వినతులు

మాది చిన్న పంచాయతీ. స్టాంప్ డ్యూటీ నిధులు తక్కువగానే వస్తాయి. రావాల్సిన నిధులు కూడా రాకపోతే పంచాయతీ నిర్వహణ కష్టం. ఒకటో తేదీ వచ్చిందంటే సిబ్బంది జీతాల కోసం తర్జన భర్జన పడాల్సి వస్తోంది. ఇటీవల వచ్చిన నిధులు సచివాలయంలో చిన్నపాటి ఖర్చులకే సరిపోలేదు.

- గవరపాలెం సర్పంచ్ కొయిలాడ శ్రీను ఆవేదన



పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం / పెదగాడి పంచాయతీ గ్రామ సచివాలయం / పినగాడి పంచాయతీ గ్రామ సచివాలయం

పెందుర్తి:

రిజిస్ట్రేషన్ శాఖను నుంచి పెందుర్తి మండలానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ నిధులకు మూడేళ్లుగా బ్రేకులు పడ్డాయి. పంచాయతీల వాటాగా రావల్సిన రూ.10 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో మండలంలోని 15 పంచాయతీలు కనీస అవసరాలకు డబ్బుల్లేక అవస్థలు పడుతున్నాయి. పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వలేక, విద్యుత్ బకాయిలు చెల్లించలేక, పారిశుధ్య పనులకు సామాగ్రి కొనుగోలు చేయలేక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఆపసోపాలు పడుతున్నారు.

సర్దుకుపోతున్నారు..

ప్రస్తుతం మొత్తం 15 పంచాయతీలు కేవలం ఇంటి/ఆస్తి పన్ను ద్వారా వచ్చిన నిధులతోనే సర్దుకుపోతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, మండల పరిషత్ అధికారుల ఉదాసీనత వెరసి పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులతో కటకటలాడుతున్నాయి. అయితే గత నెలలో 2022 జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రూ.9.23 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. అవి 15 పంచాయతీలకు పంచగా ఏ మూలకూ సరిపోలేదని యంత్రాంగం వాపోతోంది.

బకాయిలు రూ.5 కోట్లు

పంచాయతీ పరిధిలోని భూములు, ఆస్తుల క్రయ విక్రయాల ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చిన ఆదాయంలో నిబంధనల మేరకు 10 శాతం మండల పరిషత్‌కు చెల్లించాలి. అందులో సగం పంచాయతీలకు, మిగిలిన సగం మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు పంచుకుంటాయి. ఆయా నిధుల్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల జీతాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర సాధారణ పనులకు వినియోగిస్తారు. ఈ క్రమంలో పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.10 కోట్లకు పైగా స్టాంప్ డ్యూటీ బకాయి ఉంది. అందులో 15 పంచాయతీలకు రావాల్సి వాటా దాదాపు రూ.5 కోట్లు.

సిబ్బందికి ఇబ్బందులు

మండలంలో పంచాయతీకి సగటున నలుగురు పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు. వారి జీతాలతో పాటు గ్రామాల్లో విద్యుత్ బిల్లులు, ఇతర సాధారణ పనుల కోసం ఈ నిధులనే వెచ్చించాలి. సమయానికి జీతాలివ్వకపోవడంతో పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లలో విద్యుత్ బకాయిలు ఉండడంతో ఆ శాఖ అధికారులు సైతం పంచాయతీలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు.

జీతాలివ్వలేని పరిస్థితి



మా పంచాయతీ వరకు దాదాపు రూ.50 లక్షల స్టాంప్ డ్యూటీ బకాయి ఉంది. ఉన్నంతలో పన్నుల రూపంలో వచ్చే నిధులతో నెట్టుకొస్తున్నాం. సిబ్బందికి జీతాలివ్వలేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- గొరపల్లి శ్రీను, సర్పంచ్ గొరపల్లి

భారీగా బకాయిలు



మా పంచాయితీకి దాదాపు రూ.45 లక్షల స్టాంప్ డ్యూటీ బకాయిలు ఉన్నాయి. పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీతాలు, బ్లీచింగ్ కొనుగోలుకు కూడా ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి స్టాంప్ డ్యూటీ నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. - కేసుబోయిన లావణ్య త్రినాథ్, సర్పంచ్, పెదగాడి

అధికారులకు లేఖ రాశాం



2022 నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ బకాయి ఉంది. గత నెల్లో 2022 జూలై, ఆగస్టుకు సంబంధించి రూ.9.23 లక్షలు వచ్చాయి. పూర్తిస్థాయి స్టాంప్ డ్యూటీ బకాయిలు చెల్లించాలని ఆ శాఖ అధికారులకు లేఖ రాశాం. వారి సమాధానం కోసం వేచి చూస్తున్నాం.

- గుండు అప్పలరాజు, ఎంపీడీవో, పెందుర్తి

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలపై నిరసన

పరవాడ: స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని తక్షణం విరమించుకుని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.పరమేశ్వరి ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తరువాత తుంగలో తొక్కి ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపిందన్నారు. యువగళం పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని పిలుపునిచ్చిన నారా లోకేష్ ఇప్పుడు నోరు మెదపకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



దేశపాత్రునిపాలెంలో నిరసన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

సీపీఎం ఆధ్వర్యంలో..

స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం ధర్నా నిర్వహించారు. గనిశెట్టి



పరవాడ సబ్‌స్టేషన్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆదే స్మార్ట్ మీటర్ల బిగింపునకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ రమణ, పి.మాణిక్యం, జిల్లా సిటు ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా నాయకులు ఎం.బంగారమ్మ, అన్నపూర్ణ, సీతమ్మ, సాయి, వేణి, నాగదేవి, బేగం, గౌరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆధునికీకరించిన హాస్టల్ భవన ప్రారంభోత్సవం



విద్యార్థులతో గ్రాన్యూల్స్ పరిశ్రమ ఈడీ చిగురుపాటి ఉమ

పరవాడ: విద్యాపరంగా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఫార్మాసిటీలోని గ్రాన్యూల్స్ ఇండియా పరిశ్రమ సీఎస్సార్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన పరవాడ బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిగురుపాటి ఉమతో కలిసి కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మరమ్మతులతో మూల్గుతున్న బీసీ బాలుర వసతి గృహాన్ని అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి సహాయ సహకారాలు అందించిన గ్రాన్యూల్స్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం గ్రాన్యూల్స్ పరిశ్రమ ఈడీ ఉమ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లలను విద్యావంతులను చేయడమే లక్ష్యంగా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు.

అనంతరం సంస్థ సమకూర్చిన స్కూల్ బ్యాగులు, కిట్లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, హాస్టల్ వార్డెన్ రజిని, హెచ్‌డబ్ల్యూవో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, పీలా నారాయణరావు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆదర్శ్‌లో ఇన్నోవేషన్ హబ్ సెమినార్



మాట్లాడుతున్న కరస్పాండెంట్ థియోఫిలాస్

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సెమినార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అందుకు అవసరమైన నైపుణ్యాలకు ఇన్నోవేషన్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా, ఆర్‌టీఐహెచ్ ప్రతినిధులు కె.సురేష్‌కుమార్, ఎం.మధు, కె.అనిల్‌దేవ్, బి.దినేష్, బి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రయత్నించాలి



విద్యార్థుల కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న ఆర్‌టీఐహెచ్ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: ఉపాధి మార్గంలో విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తగిన లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అన్నారు. కళాశాలలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అన్ని విభాగాల్లోనూ నిష్ణాతులైన సిబ్బందితో విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఆర్‌టీఐహెచ్ ప్రతినిధులు విద్యార్థులు పలు అంశాలపై సూచనలు సలహాలు అందించారు. వారి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని సమీక్షించారు. అధ్యాపకురాలు డాక్టర్ యు.జయలక్ష్మి, ఆర్‌టీఐహెచ్ ప్రతినిధులు ఇ.మాధురి, కె.దుర్గాప్రసాద్, ఆర్.అమూల్య, శ్రవణ్‌కుమార్, డి.ఆనంద్, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యవంతమైన పిల్లలు



మాట్లాడుతున్న సర్పంచ్ సుజాత

పరవాడ: ఆరోగ్యవంతమైన పిల్లలతో కూడిన సమాజానికి తల్లిపాలు దోహదపడతాయని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సుజాత మాట్లాడుతూ శిశువు పుట్టిన నాటి నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలను పట్టించాలన్నారు. తల్లి పాలు బిడ్డ మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. రెండేళ్ల నుంచి బిడ్డకు అనుబంధ పోషకాహారాన్ని అందించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పేద గిరిజనులకు వస్త్రాల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు అందిస్తున్న కశిరెడ్డి సురేంద్రస్వామి

సింహాచలం: ఒడిశా రాష్ట్రం కోరాట్ జిల్లా గులుపాండి, అల్లూరి జిల్లా డుంబ్రిగుడ, అరకులో పేద గిరిజనులకు సింహాచలంలోని సింహాద్రి మఠం ఆధ్వర్యంలో మంగళవారం వస్త్రాలు పంపిణీ చేశారు. మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి 280 గిరిజనులకు చీరలు, దుప్పట్లు, తువ్వాళ్లు, సింహాద్రి అప్పన్న ఫొటోలు అందించారు. హిందూ ధర్మం, శ్రీనృసింహ విశిష్టతలను వివరించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంలో నడవాలని సూచించారు.

ముఖ ఆధారిత హాజరుతో బినామీలకు చెక్



మాట్లాడుతున్న పీడీ పూర్ణిమాదేవి

సబ్బవరం: ఉపాధి హామీ పథకం కార్మికులందరికీ ముఖ ఆధారిత హాజరు తీసుకుని, రెండు పూటలా వారిచే పనిచేయించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి పథకం సిబ్బందికి మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముఖ ఆధారిత హాజరుతో బినామీలను అరికట్టవచ్చన్నారు. గ్రామ పంచాయతీల్లో చేసే పనులకు వేతనం రూ.300 వచ్చేట్లుగా చూడాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 134 మంది క్షేత్ర సహాయకులకు అనకాపల్లి క్లస్టర్‌కు చెందిన సబ్బవరం, అనకాపల్లి, కశింకోట, మునగపాక, పరవాడ, రావికమతం మండలాల ఏపీవోలు, ఇంజినీరింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ముఖ ఆధారిత హాజరు, జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్, సెక్యూర్ లాగిన్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మణికుమార్, శ్రీనివాస్, ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు ఇసుక మేటలపై ఎన్టీపీసీ చర్యలు



ఉప్పుటేరు కాలువ తవ్వకాలకు అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎన్టీపీసీ అధికారులు



ఉప్పుటేరు కాలువ తవ్వకాలను ప్రారంభించిన ఎన్టీపీసీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: వ్యవసాయం, ఉప్పు గల్లీ భూములకు అవరోధంగా మారిన ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో ఇసుక మేటలతో పాటు, నీటిని తొలగించేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం మంగళవారం చర్యలు చేపట్టింది. గత నెల 30న 'ఉప్పుటేరు... రైతులు బేజారు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎన్టీపీసీ అధికారులు స్పందించారు. ఉప్పుటేరు కాలువ తవ్వకాలకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముత్యాలమ్మపాలెం మత్స్యకార నాయకులు, ఎన్టీపీసీ అధికారులతో చర్చించి రైతుల ఇబ్బందుల్ని తొలగించాలని ఆదేశించారు. ఉప్పుటేరుకు అడ్డంగా పడిన ఇసుక మేటల తవ్వకాలను మంగళవారం ప్రారంభించారు.

అయితే ఈ తొలగింపు ప్రక్రియ పొక్లెయిన్లతో కాకుండా కూలీలతో చేపట్టడంతో ఉప్పుటేరు నీరు సక్రమంగా వెళ్లే మార్గం కనిపించలేదు. దీంతో బుధవారం యంత్రాల సాయంతో పూర్తిస్థాయిలో ఇసుక మేటలను తొలగించనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

ఆటోలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారి జ్యోస్మిత

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆగివున్న పాసింజర్ ఆటోను వెనుక నుంచి స్కూల్ పిల్లలతో వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రయాణికుల ఆటోలో వెనుక కూర్చున్న విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన కోడూరు రామకృష్ణ కాలికి, సబ్బవరం గోపాల్‌నగర్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థి జ్యోస్మితకు తలకు స్వల్ప గాయమైంది. క్షతగాత్రులను సబ్బవరం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం



గోవిందరాజు

పెందుర్తి: వేపగుంట సమీపంలోని అప్పన్నపాలేనికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. సింహపురి లే అవుట్ ఎదురుగా సింహాద్రి రెసిడెన్సీలో ఉంటున్న కలవలపల్లి గోవిందరాజు(60) రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ నెల 2న నగరంలోని కోర్టుకు బయల్దేరిన ఆయన ఇంటికి తిరిగి రాలేదు. మూడు రోజులుగా ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల్ని, స్నేహితుల్ని ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో అతడి కుమార్తె కలవలపల్లి కృష్ణ లలితశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ సుమిత్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ లీకేజీ



బీఆర్‌టీఎస్ రహదారి కృష్ణరాయపురం పెట్రోల్ బంక్ సమీపంలో డ్రైనేజీ కాలువ లీకేజీ కారణంగా రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. రెండు రోజుల క్రితం లీకేజీ ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సైతం ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- పెందుర్తి